# రెండు తలల మనిషి

భానుమూర్తి తెలివైనవాడు. ఉట్టి తెలివైన వాడేకాదు చాలా తెలివైనవాడు. ఇంకా గట్టిగా చెప్పాలంటే దేవాంతకుడని కూడా అనొచ్చు. భానుమూర్తి పదవి ఏమిటన్నది అంత ముఖ్యంకాదు గనక ఆ విషయం వదిలేద్దాం. అతని గురించిన ఉపోద్ఘాతం ముందే చదివారుగనక అతని పదవి గురించి మీరూ పట్టించుకోరనుకుంటాను. అతను పనిచేస్తోన్నది మాత్రం మార్కెటింగ్ ఆఫీసులో. ఆ ఉద్యోగం అతనికి రావడం అదృష్టం అంటారు కొందరు. తండ్రి సర్వీసులో వుండగా పోవడం – సరిగ్గా అదే టైముకి భానుమూర్తి డిగ్రీ పూర్తి అయి వుండడం అదృష్టంకాక ఏమిటి?

ఆఫీసులో చాలా సీరియస్‌గా ఫైళ్లు చూస్తున్న భానుమూర్తికి డిప్యూటీ మేనేజర్ రమ్మన్నాడన్న కబురుతో ఎక్కడి ఫైళ్లు అక్కడే వదిలేసి డిప్యూటీ మేనేజర్ గదిలోకి పరుగులాంటి నడకతో వెళ్లాడు.

"సార్. పిలిచారుట!" అన్నాడు అతి వినయంగా వంగిపోయి.

భానుమూర్తి పలకరింపుకి కనుబొమలు ముడివేసి అతన్ని ఎగాదిగా చూసి "ఏమోయ్ భానుమూర్తీ! నిన్న మేనేజర్ కూతురి పెళ్లిలో పెత్తనమంతా నీదేలాగుందే! చాలా హడావిడిగా, హుషారుగా తిరిగేశావ్" అన్నాడు సంతకాలు పెట్టిన ఫైళ్లు పక్కన పెడుతూ.

ఏవో అర్జంటు పని కోసం పిలిచాడనుకున్న భానుమూర్తి డిప్యూటీ మేనేజర్ అడిగిన ప్రశ్నకి దెబ్బతిన్న లేడిలా వెర్రి ముఖం వేసి వెంటనే ఏం జవాబివ్వాలో అర్థంకాక కాస్త తికమకపడ్డమాట నిజమే! అయినా వెంటనే సర్దుకుని "లేదు సార్! ఖర్మకాలి మొన్న మార్కెట్‌లో మేనేజర్ ఎదుటపడ్డా సార్! వెంటనే పిల్చి 'మా అమ్మాయి పెళ్లి – వచ్చి నిలబడా' లన్నారు సార్! ఏదో వెళ్ళి నిలబడటమేకదా అనుకుంటే గాడిద చాకిరీ చేయించుకున్నారు సార్! ఆయన భార్యకి మరీ గర్వం సార్! ఏదో బంట్రోతాడికి చెప్పినట్లుగా నాకు పన్లు పురమాయించడం, చాలా చిరాకు, విసుగు కలిగాయండి!

సరే దొరికిపోయానురా బాబూ! అనుకుని, ఎంత తొందరగా బయటపడదామా అనుకుంటూ ముహూర్తం అవడమేమిటి – మరి కనపడకుండా పారిపోయి వచ్చేసాను సార్" అంటూ అతి వినయానికి అబద్ధాలు జోడించి చేతులు కట్టుకుని చెప్తున్న భానుమూర్తిని నవ్వుతూ చూసి "చూడు భానుమూర్తీ! వచ్చేవారం మా అబ్బాయి వడుగు. తప్పకుండా రావాలి. నాకీ ఆఫీసు పనే సరిపోతోంది. కాస్త సాయంకాలాలొచ్చి బయట పన్లు చూసిపెట్టాలోయ్!" అన్న మాటలు పూర్తికాగానే "అమ్మమ్మా! ఎంత మాట, ఎంత మాట! మీరంతలా చెప్పాలా! మీ ఇంట్లో వడుగంటే మా ఇంట్లో వడుగన్న మాటే! ఈ సాయంత్రమే వస్తాను సార్! కావాలంటే ఈ నాలుగు రోజులూ సెలవు పడేస్తాను సార్!" అంటూ మహా వినయంగా చెప్పడమే కాకుండా వడుక్కి వారం రోజులు సెలవుపెట్టి, రాత్రింబగళ్ళు నిద్రాహారాలు మాని, చెప్పిన పనీ, చెప్పని పనీ చేసొచ్చాడు భానుమూర్తి.

మర్నాడు ఆఫీసులో ఫైళ్ళ సంతకాలకి వెళ్ళిన భానుమూర్తిని పలకరించి "ఏమోయ్ భానుమూర్తీ! మా ఇంట్లో పెళ్ళి రోజు మాత్రమే కనపడ్డావు. మరి ఆ డిప్యూటీ మేనేజర్ ఇంట్లో వడుక్కి వారం రోజులు సెలవుపెట్టి మరీ వెళ్లావు. అంట్లు కూడా తోమేవా ఏమిటి? నాకంటే నీకతను ఆప్తుడా? అంటూ వెటకారంగా అడుగుతున్న మేనేజర్ పాదాల దాకా వంగిపోయి "హిహిహిహి" అని పళ్ళికిలించి నవ్వుతూ, "కాదు సార్! మీకు ఎదుటి వ్యక్తుల్ని గౌరవించడం, ఏ పన్లు చేయించుకోవాలి, ఏ పన్లు చేయించుకోకూడదు అన్నది తెలుసు సార్!

నా ఖర్మకాలి నా కొంప ఆ డిప్యూటి మేనేజర్ ఇంటి వెనక వీధిలోనే కావడంతో నిమిష నిమిషానికి బంట్రోతుని పంపి పిలిపించి, నాచేత అడ్డమైన వెట్టి చాకిరీ చేయించడం సార్! అప్పటికీ ఎన్నోసార్లు ఇంట్లో లేనని చెప్పించి తప్పించుకున్నాను సార్! నా ఖర్మ సార్! ఏం చెప్పమంటారు – సార్! సార్ ! మీకీ విషయం తెల్సా? ఆయన కొడుకు వడుక్కి ఒక్క కూరగానీ, పప్పులుగానీ, ఆఖరికి పొయ్యిలో పెట్టుకునే కఱ్ఱలుగానీ కొనలేదు సార్! అన్నీ అప్పనంగా వచ్చినవేట! అవీ, ఇవీ పంపమని దుకాణదారుల్ని బెదిరించి మరీ తెప్పించుకున్నాడుట. వడుక్కి ఒక్క పైసా ఖర్చు కాలేదట సార్!" అంటూ మేనేజర్ సంతకాలుచేసి అందించిన ఫైళ్ళందుకుని బయటికొచ్చాడు చాలా తెలివైన భానుమూర్తి. మేనేజర్ని బుట్టలో వేసుకున్నానన్న ఆనందంతో.

ఆ ఆఫీసులో మేనేజర్‌కి, డిప్యూటీ మేనేజర్‌కి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందని ప్రతి ఒక్కరికీ తెలుసు. కానీ ఎవరికి వారు మనకెందుకొచ్చిన

గొడవనుకుని వాళ్ళ వాళ్ళ పన్లు చేసుకుపోవడం తప్ప వాళ్ళిద్దరి మధ్య పాలిటిక్సులో తలదూర్చరు.

కాని చాలా తెలివైన భానుమూర్తి మాత్రం ఇంతవరకు ఎవరి పార్టీవాళ్ళకి వాళ్ళ పార్టీవాడిలా కనబడుతూ, ఎవరికీ దొరక్కుండా తప్పించుకుంటున్నాడు. ఎవరికి వారు భానుమూర్తి తన పక్షమే అన్న అభిప్రాయం బలపడే అంత చాకచక్యంతో మెలుగుతూ అతితెలివిగా నెట్టుకొస్తున్నాడు.

"సార్ పిలుస్తున్నారని ప్యూన్ చెప్పగానే పరుగు, పరుగున వెళ్ళిన భానుమూర్తిని ఎంతో ఆప్యాయంగా పలకరించి కూర్చోపెట్టి, టీ ఇచ్చిన తరువాత "చూడు భానుమూర్తీ! మన మేనేజర్ ప్రవర్తనేం బాగాలేదని మన ఆఫీసులో కొందరు గోల పెడుతున్నట్లు తెలిసింది. నా పేరు బయటకి రాకుండా నే చెప్పినట్లు కాకుండా యూనియన్ లీడర్ ఆదిరాజుకి చెప్పి ఏదోలా గొడవ చేయించి మేనేజర్‌గాడి ఉద్యోగం పీకించడమో లేదా, ఏ కొండ ప్రాంతాలకో బదిలీ అయ్యేలా చూడటమో చెయ్యాలోయ్!" అన్న డిప్యూటీ మేనేజర్ మాటలకి పచ్చి వెలక్కాయ గొంతులో పడినట్లయింది భానుమూర్తికి.

యూనియన్ లీడర్‌తో మాట్లాడగానే సరిపోదు - మిగతా స్టాఫ్‌తో చర్చించాలి. మేనేజర్‌ని తిట్టాలి. అందులో ఎవడో ఒకడు మేనేజర్‌కి విషయం తెలియజేస్తే?? అప్పుడు తను ఒక్క పార్టీవాడే అయిపోతాడీ దెబ్బతో.

మేనేజర్, డిప్యూటీ మేనేజర్ మధ్య జరుగుతున్న ఈ కోల్డు వార్‌లో ఎవడో ఒకడు ఈ ఊరినుంచి వెళ్ళడం ఖాయమని భానుమూర్తికి తెలుసు. కానీ 'ఎవరు?' అన్నది తెలీని భానుమూర్తి ఇద్దరి దగ్గరా మంచి సంపాదించి, ఒకళ్ళు వెళ్ళిపోగానే రెండో వాడిని పట్టుకుని నేను మీ పార్టీయే అంటూ వెళ్ళిపోయిన వాడిని గట్టిగా తిట్టి ప్రమోషన్ సంపాదించాలన్నది అతని ప్లాను.

ఇప్పుడు డిప్యూటీ మేనేజర్ పురమాయించిన ఈ పనితో కథ అడ్డం తిరిగింది. ఇప్పుడితను చెప్పినట్లు చేస్తే డిప్యూటీ మేనేజర్ మనిషవడం ఖాయం. ఇన్నాళ్లూ చాలా తెలివిగా తప్పించుకున్నా - ఈ రోజు ఈ ఉచ్చులోంచి ఎలా తప్పించుకోవాలో అర్థంకాని భానుమూర్తి గుడ్లు తేలేసి "నాకూ ...నాకూ యూనియన్‌లీడర్‌తో అంతగా పరిచయం లేదు సార్!" అని తప్పించుకోబోయాడు.

దాంతో డిప్యూటీ మేనేజర్ కుర్చీలోంచి తారాజువ్వలా లేచి "ఏంటోయ్ భానుమూర్తీ! నన్నే మాయ చేస్తున్నావా? ఆదిరాజు మీ బంధువుటకదా?" అన్నదానికి నెత్తిమీద పిడుగుపడ్డట్టే అయింది భానుమూర్తికి.

"అవుననుకోండి. అంత సత్సంబంధాలు లేక..." అంటూ నీళ్ళు నములుతున్న భానుమూర్తిని ఉరిమినట్లు చూసి "ఇష్టం లేకపోతే చెప్పు - నేను వేరేవాళ్లతో మాట్లాడతాను. ఏదో మంచివాడివి, నా మనిషివని, ఆదిరాజు నీ బంధువనీ అడిగాను" అన్న డిప్యూటీ మేనేజర్ మాటలకి తత్తరపడుతూ "అమ్మమ్మా ఎంత మాటా - ఎంత మాట! ఇప్పుడే వెళ్ళి ఆదిరాజుతో మాట్లాడి మీ పని పూర్తయ్యేలా చూస్తా" అన్న భానుమూర్తి మాటలకి డిప్యూటీ మేనేజర్ కొంచెం చల్లబడి మళ్ళీ కుర్చీలో కూర్చుంటూ "జాగ్రత్త సుమా! నా పేరు మాత్రం బయటకి రాకూడదుస్మీ!" అని మళ్ళీ చెప్తూ నవ్వేడు.

డిప్యూటీ మేనేజర్ గదిలోంచి బయటికొచ్చిన భానుమూర్తికి మరో రెండు గంటలకి మేనేజర్ దగ్గర నుంచి పిలుపు రావడంతో " ఇతనే కొంప ముంచమంటాడో దేముడా!" అనుకుంటూ అతని గదిలోకి నడిచాడు.

"సాయంకాలం ఓసారి ఇంటికి రావోయ్! నీతో అర్జంటుగా పనుంద"ని మాత్రం చెప్పి పంపేసిన భానుమూర్తికి విషయం ఏమిటో అంతుదొరక్క పురుగు తొలుస్తున్నట్లు బుర్ర తొలవసాగింది.

సాయంకాలం మేనేజరింటికి వెళ్లిన భానుమూర్తి చేతిలో టైపుచేసిన కాగితం పెట్టి చదవమన్నాడు మేనేజర్.

అది చదివిన భానుమూర్తికి గుటక మింగబడక గుడ్లు బయటికి రాసాగాయి. అది గమనించని మేనేజర్ "చదివావోయ్ భానుమూర్తీ! ఈ పేపర్ పట్టుకెళ్ళి యూనియన్ లీడర్కిచ్చి, పెట్టించగలిగినన్ని సంతకాలు పెట్టించు. ఆఖరికి స్వీపర్, చప్రాసీగాళ్ళ సంతకాలు కూడా తీసుకోండి. ఈ డిప్యూటీ మేనేజర్ గాడి పీడ ఈ దెబ్బతో విరగడవ్వాలి. వాడిని తరిమెయ్యగానే ఈ పని చేసినందుకు నీకు ప్రమోషన్ రావడం ఖాయం"అంటున్న మేనేజర్వైపు నవ్వు పులుముకున్న ముఖంతో చూసి "అలాగే సార్!" అంటూ చమటతో తడిసి ముద్దయిన శరీరంతో బయటికొచ్చాడు భానుమూర్తి.

రోడ్డున నడుస్తున్న భానుమూర్తి మదిలో ఆలోచనలు వెర్రెక్కించేస్తున్నాయి. వచ్చి వచ్చి ఈ ముప్పు నా నెత్తిన పడిందేమిటిరా బాబూ! అన్నదే అతని బెంగ, బాధ. ఈ దెబ్బతో తన నాటకం కట్టు ఇక ఇద్దరిలో ఎవరో ఒకరి పక్షముండక తప్పదు. ఆలోచించగా ఆలోచించగా భానుమూర్తికి తను మేనేజర్పక్షం వుండటమే మంచిదనిపించింది. అతను హోదాలో పెద్దవాడు. పైగా ప్రమోషన్ ఇస్తానని వాగ్దానం కూడా చేశాడు అనుకుని చివరికి మేనేజర్ కాగితంపై సంతకాలు సేకరించి తీసుకెళ్ళి స్వయంగా భానుమూర్తే మేనేజర్కి ఇచ్చి వచ్చాడు.

ఆ దెబ్బతో మేనేజర్ బలం రెండింతలై ఆ పితూరు కాగితం హెడ్డాఫీసుకి పంపి, మరో రెండు నెలలకి డిప్యూటీ మేనేజర్‌ని ఆ ఊరినుంచి కొండ ప్రాంతాలకి బదిలీ చేయించి పంపించేశాడు. వెళ్తూ వెళ్తూ భానుమూర్తివైపు పళ్ళు కొరుకుతూ చూసి "ఎప్పటికైనా నీ అంతం చూడకపోను. నమ్మకద్రోహి, ఎంత నాటకాల రాయుడివో తెలిసింది. నా దగ్గర నన్ను మెప్పించేలా మాట్లాడి, ఆ మేనేజర్‌గాడితో చెయ్యి కలిపావా దగాకోర్!" అంటూ వెళ్ళిపోయాడు.

'నువ్వేం చేస్తావింక లేవోయ్!' అని మనసులో అనుకుని వెటకారంగా నవ్విన భానుమూర్తికి మరో నెల్లాళ్ళకే ప్రమోషన్ వచ్చేసింది.

ప్రమోషన్ వచ్చిందన్న శుభవార్త చెబ్దామని ఇంటికొచ్చిన భానుమూర్తికి గేటు దగ్గరకే ఇంట్లోంచి చిన్న రకం మహాభారత యుద్ధంలాంటిది వినిపించడంతో ఆనందమంతా ఆవిరైపోయింది.

తలుపు పిల్లిలా తట్టిన భానుమూర్తికి భార్య విసురుగా తలుపు తీసి చురచురా చూస్తూ లోపలికెళ్ళిపోయింది. కొడుకుని చూడగానే పెడుతున్న శోకాల స్థాయిపై షడ్జమానికి పెంచి "ఒరేయ్ భానూ! నేనింక ఒక్కక్షణం ఈ ఇంట్లో వుండలేనురా! కడుపూ కాళ్ళూ కట్టుకుని నిన్ను కష్టపడి పెంచి, పెద్దవాడిని చేసినందుకు ఈ ఇంట్లో నాకేం గౌరవం వుందిరా? నీ తండ్రే బతికుంటే నా ఖర్మ ఇలా కాలిపోయేదా? ఆ మహారాజు బతికున్నన్నాళ్లూ నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకున్నారురా! ఎంత కష్టపడి నిన్నింతటివాడిని చేశానురా! పెళ్ళానికి చెప్పుకోలేనివాడివి ఏం మగాడివిరా! ఓ నాలుగైదొందలుంటే నా ముఖాన పడెయ్యి. ఏ కాశీకో, హరిద్వార్‌కో పోయి ఏ ఆశ్రమంలోనో దిక్కుమాలిన వాళ్లల్లో ఒకర్తిగా నేనూ నా చివరి దశ గడిపేస్తాను. ఈ గుప్పెడు ప్రాణానికి ఏ ఆశ్రమంలోనో గుప్పెడు మెతుకులు దొరక్కపోవు" అంటూ శోకాలెడుతున్న తల్లివైపు చూసి –

"ఛ – ఊరుకో అమ్మా! ఏమిటలా ఏడుస్తావు! ఇలాంటి గొడవలతో ఇరుగు పొరుగులకి మనమెంత లోకువయిపోతున్నామో తెలుసా? ఇదిగో ఈ ఐదు రూపాయలూ తీసుకుని అలా గుళ్ళోకెళ్ళిరా! భద్రాచలం నుంచి మంచి పండితుడొచ్చి రామాలయంలో పురాణం చెప్తున్నాడుట" అని తల్లిని లేవదీసి రిక్షా ఎక్కించిన కొడుకువైపు సంతోషంగా చూస్తూ, రెండు బుగ్గలూ చిదిమి ముద్దెట్టుకున్న పార్వతమ్మ "ఆ కోడలే రాక్షసి. నా కొడుకు బంగారమే" అంది పైకే.

తల్లి రిక్షా అటు వెళ్లగానే వంటింట్లో ఉన్న భార్య దగ్గరకొచ్చి భుజం చుట్టూ చెయ్యి వెయ్యగానే తాచుపాములా ఎగిరిపడ్డ సుజాత "ముందా చెయ్యి తీసి మరీ మాట్లాడండి" అంది భానుమూర్తివైపు చురచుర చూస్తూ –

"ఎందుకోయ్ సుజా! అంత కోపం? ఆ ముసిలిదానికి అయిదు రూపాయిలిచ్చి రాత్రి పదిదాకా రాకుండా పంపేశానుగా?" అంటూ దగ్గరకి తీసుకోబోయిన భర్తని ఒక్క నెట్టు నెట్టి -

"నిన్న నేను గాజులేయించుకుంటానంటే పైసాలేదన్నారు? ఈరోజు మీ అమ్మకి ఇవ్వడానికి అయిదు రూపాయలెలా వచ్చాయి? కట్టుకున్న పెళ్లాం ముద్దు ముచ్చట్లు తీర్చలేని మొగుడూ ఓ మొగుడేనా? ఏదో ఈ ప్రపంచంలో తనొక్కర్తే కష్టపడి కని మిమ్మల్ని పెంచానని, తనకేం చెయ్యటంలేదని ఆవిడేమో ఏడుస్తోంది. పైగా నా వళ్ళంతా బంగారం తొడుగుతో కప్పేసినట్లు బాధపడిపోతోంది! నేనేం మీ సొమ్ము మూటగట్టేసుకోటంలేదు. మీ అమ్మనే దగ్గరెట్టుకుని ఆవిడ అచ్చటా ముచ్చటా తీర్చండి పాపం - కడుపూ కాళ్ళూకట్టుకుని మరీ పెంచిందిట" అంటున్న భార్య మాటలకి ఏమాత్రం నొచ్చుకోకుండా, కోపం తెచ్చుకోకుండా -

"చూడు సుజా! నిజంగా ఇకముందు నీ వళ్లంతా బంగారమే! ఈ గుడ్‌న్యూస్ ఆ ముసలమ్మకి చెప్తే 'పదియ్యి, పాతికియ్యి' అని తినేస్తుందనే అలా పంపేసి ఇలా వచ్చానోయ్! అసలు విషయం చెప్తా ఇలారా మరీ!" అంటూ సుజాతని ఎత్తుకుని మరీ గదిలోకి తీసుకొచ్చి తనకి ప్రమోషన్ వచ్చిన విషయం చెప్పి ముద్దులతో ముంచెత్తాడు.

భానుమూర్తి ఇంటికి రాగానే తరచు ఎదురయ్యే ఇలాంటి మల్లయుద్ధాలని ఇలాగే చాలా తెలివిగా చల్లార్చి, భార్య బాత్‌రూంలో వుండగానో, మార్కెట్‌కో, పొరుగింటికో వెళ్ళినప్పుడో తల్లిదగ్గర కూర్చుని, "అమ్మా! ఆ రాక్షసితో నువ్వూ, నేనూ గనక బతుకుతున్నాం, ఏం చేస్తాం - మన ఖర్మ. ఇక ఇది వదిలేది లేదు. జన్మంతా భరించాల్సిన శని. కావాలంటే నువ్వు కూతురింటికో చెల్లెలింటికో వెళ్ళి కొన్నాళ్లు దాని బారినుంచి తప్పించుకుంటావు - నా మాటేమిటి చెప్పు!" అంటూ భార్యని తిట్టిపోసి తల్లి దగ్గర తల్లి పలుకులు, అమ్మకూచిలా పలుకుతూ 'నీ కోడలికి చెప్ప'కంటూ చాటుమాటుగా అయిదులూ, పదులూ ఇచ్చి పార్వతమ్మని తృప్తిపరిచేవాడు.

అలాగే తల్లి గుడికో, పురాణానికో వెళ్లినప్పుడు సుజాత దగ్గర తియ్యటి కబుర్లు చెప్పి చాటుగా తెచ్చిన స్వీట్లు ఆమె నోట్లో పెడుతూ తల్లికి తెలీకుండా కొన్న చీరల్ని ఇచ్చి ఆమె వద్ద తల్లిని తిట్టిపోసేవాడు. దాంతో కొడుకుని చూసి తల్లి, భర్తని చూసి భార్య జాలిపడిపోవడమే కాకుండా, పార్వతమ్మ, సుజాతల మధ్య వైరం రోజు రోజుకీ పెరిగిపోతూ, ఒకరిని చూస్తే మరొకరికి పట్టలేని అసహ్యం, రోత పెరిగిపోసాగాయి.

ప్రమోషన్ కుర్చీ చాలా లాభసాటిది కావడంతో భానుమూర్తి జేబులు తెగనిండిపోసాగాయి. దాంతో ఇంటి రూపం కూడా మారసాగింది.

ఇది చూసి పార్వతమ్మ కోడలు లేని టైము చూసుకుని – "ఒరేయ్ భానూ! నీ చదువు కోసం నా బంగారమంతా అమ్మేశానురా! ఇప్పుడేదో కాస్త గడించుకుంటున్నట్లున్నావు. నాకో జత గాజులు, ఓ పేట గొలుసన్నా చేయించి పెట్రా! ఏ పెళ్ళికెళ్ళినా బోసి చేతులు, బోడి మెడతో వెళ్తున్నాను" అంది.

"అలాగేనమ్మా!" అనడమే కాకుండా, మరో వారానికల్లా రెండు జతల గాజులు, గొలుసు చేయించి తెచ్చి తల్లికిచ్చాడు.

అవి చూసి మురిసిపోయిన పార్వతమ్మ కొడుకుని పొగిడేసి కోడల్ని నాలుగు తిట్టిపోసింది. భానుమూర్తి తల్లితో వంతపాడి, "అమ్మా! ఇవి నీ పెట్టడుగున దాచుకుని ఊరికెళ్లినప్పుడు వేసుకో! ఆ రాక్షసికి తెలిస్తే నిన్నూ, నన్నూ కూడా బతకనివ్వదు. మన ఖర్మకాలి తెలిస్తే మీ చెల్లెలు డబ్బిస్తే రోల్డుగోల్డువి కొనుక్కున్నానని చెప్పు. లేదంటే చంపేస్తుంది" అన్నాడు.

భార్య పుట్టింటి నుంచి వచ్చిన రాత్రే భార్య పక్కన సరసాలాడుతూ పరుపుకింద దాచిన సంచీని తీసి సుజాత వళ్లోవేసి "ఏంటో చూస్కో" అన్నాడు భార్య వళ్లో పడుకుని నడుం చుట్టూ చెయ్యేస్తూ.

సంచీ తెరిచి చూసిన సుజాత కళ్ళు జిగేలు మన్నాయి. మూడు పేటల చంద్రహారం, కాసుల పేరు, నెక్లెసు, నాలుగు జతల గాజులు అవి చూసిన సుజాత ఆనందంతో ఉక్కిరిబిక్కిరయి భర్త కౌగిట్లో గారాలు గుడుస్తూ "మీ ముసిలిదానికి తెలిస్తే మన్ని బతకనిస్తుందా?" అంది.

"ఆ – అన్నీ దానికి చెప్పాలా? అయినా ఈ రోజేగా పుట్టింటినుంచి వచ్చావు! రేపు చూపించి, మీ నాన్న నీ వాటా భూమి అమ్మి ఇచ్చాడని, ఆ డబ్బుతో ఈ నగలు చేయించుకున్నాననీ చెప్పు. ఆవిడకేం తెల్సు – మీ నాన్న కెంత పొలం వుందో! నీ వాటా ఎంతో!! " అంటూ సుజాతని మరీ గట్టిగా హత్తుకున్నాడు.

ఈ విధంగా భానుమూర్తి వారిద్దరితో నాటకం ఆడుతూ, ఇద్దరి దగ్గరా మెప్పుపొందుతూ వారిద్దరిలో ద్వేషాన్ని పెంచసాగాడు.

ఏడాదిలోనే భానుమూర్తి బ్యాంకు బేలన్సు లక్షలకి పెరిగిపోయింది. భార్య వంటిని నగలు పెరగసాగాయి. ఇంట్లో ఖరీదైన సామాన్లు పెరిగిపోసాగాయి. అయిదుల జాగాలో తల్లికి వందలు, యాభైలు చాటుగా ఇవ్వసాగాడు. అలాగే భార్యకి వేలు. ఇలా అతని

జాతకం గొప్పగా వెలిగిపోతోంది. ఏ చీకూ చింతా లేకుండా చాలా హాయిగా రోజులు గడుస్తున్నాయి.

ఆఫీసుకెళ్ళిన భానుమూర్తి నెత్తిన పిడుగుపడినంత భయంకరమైన వార్తే విన్నాడు. ఈ మేనేజర్‌కి బదిలీ అవడమేకాదు – ఇక్కడనుంచి వెళ్ళిపోయిన డిప్యూటీ మేనేజర్ ఇప్పుడు మేనేజర్ హోదాలో మళ్ళీ ఈ ఆఫీసుకే బదిలీ చేయించుకుని వస్తున్నాడన్నది.

వెళ్ళిపోయిన డిప్యూటీ మేనేజర్ మినిస్టర్‌ని పట్టుకుని తనకి జరిగిన అన్యాయాన్ని చెప్పి, మేనేజర్‌ని మరో అడవి ప్రాంతానికి పంపించి తను మళ్ళీ ఇక్కడికే బదిలీ చేయించుకుని వస్తున్నాడని ఆఫీసులో జనం ద్వారా తెలిసింది.

మేనేజర్ మీద కసి తీర్చుకుని తనకి కనపడని దూరప్రాంతాలకి పంపేశాడు. వాళ్లు ఒకరినొకరు కలుసుకునే ప్రసక్తిలేదు. కానీ తన పని?? మేనేజర్ హోదాలో వస్తున్న డిప్యూటీ మేనేజర్‌కి రోజూ ఎదురుపడాలి! తన గతేమిటి?

'నీ అంతు చూస్తా' అంటూ వెళ్ళేముందు ఆడిన మాటలొక్కసారి చెవుల్లో దూరి గూబ గుయ్‌మనిపించాయి. నా పనేమవుతుందో దేముడా! అన్న దడ పట్టుకుంది. చమటలు కక్కసాగాడు భానుమూర్తి.

మేనేజర్ హోదాలో వచ్చిన డిప్యూటీ మేనేజర్ ఆఫీసులోకి వస్తూనే భానుమూర్తికేసి చూసిన చూపుకి అతనేగానీ బొగ్గో, కర్రో అయివుంటే కాలి బూడిదయివుండేవాడు.

చివరికి భానుమూర్తి భయపడ్డంతా అయింది. తన వాళ్ళచేత లంచం ఇప్పిస్తూ, రెడ్‌హేండెడ్‌గా భానుమూర్తిని పట్టించి ఉద్యోగం వూడపీకించడంతో వూరుకోక, ఇలా చాలా లంచాలు పట్టాడన్న నెపంతో ఎంక్వయిరీ పెట్టించి, ఏడాదిలో నింపిన బ్యాంకు బ్యాలన్సులు, లాకర్‌లలో దాచిన భార్య నగల్ని తీయించి పట్టించాడు కొత్త మేనేజర్. దాంతో ఉద్యోగం కూడా 'హుష్‌కాకీ' అయింది.

ఉద్యోగం తీసేసినట్లు వచ్చిన కాగితం పట్టుకుని ముఖం వేలాడేసుకుని వచ్చిన భానుమూర్తికి ఇంట్లోంచి చెంబులు, ముంతలు వీధిలోకి ఎగరడం కనపడి గేటు దగ్గరే ఆగిపోయాడు.

వీధిలోనే నిలబడ్డ భర్త మీదికి అపరకాళిలా విజృంభిస్తున్న భార్యని చూసి కొయ్యబొమ్మలా నిలబడిపోయాడు. తిన్నగా వచ్చి భర్త చొక్కా పట్టుకుని "మీ అమ్మ పెట్లో ఆ బంగారం నగలు, అంత డబ్బూ ఎక్కడిది? నిజం చెప్పండి! మా అవతారం పిన్ని చెప్పిన మాటలన్నీ నిజమే నన్నమాట. నా దగ్గర ఆవిడని దుమ్మెత్తిపోస్తూ, నా చాటుగా ఆ ముసిలిదానికి నగలూ, డబ్బూ దోస్తున్నారా? నంగనాచిలా ఎందుకీ

నాటకం?" అంటూ ఎగిరిపడుతున్న భార్యకేం చెప్పాలో బోధపడక, ఇరుగుపొరుగు తన్నే చూస్తున్నారన్న సిగ్గుతో తలొంచుకుని లోపలికి నడిచాడు గబగబా.

తులసికోట దగ్గర గోడు గోడున ఏడుస్తున్న తల్లిని చూసి ఉన్న మతికూడా పోయింది భానుమూర్తికి.

"ఏరా నాయనా! నంగనాచిలా అలా చూస్తావేం? పెళ్ళానికి నగలు చేయించి చీరలు కొన్నానంటే నేనేం ఏడ్చిపోతానా? నా కళ్ళనీళ్ళు తుడవడానికి నాకో పదికాసుల నగలు చేయించి పడేసి, దానికన్ని నగలు చేయించావంటే ఎంత పెళ్ళాంగాడివో, ఎంత కొంగుపట్టుకు తిరిగే చవటవో తెలీదనుకున్నావా? నువ్వు దాచినా అవతారమ్మ వదిన అన్నీ చెప్పింది లేరా! అంత నేను చేదయితే నీ ఇంట్లోంచి పోతాలేరా! ఇందుకేరా నీ ముఖాన్ని వున్నదంతా వూడ్చి చదివిస్తి! ఇలా ఉద్ధరిస్తావనేరా!" అంటూ పెద్ద పెట్టున రాగాలు తియ్యసాగింది పార్వతమ్మ. ఈ గొడవతో పక్కగదిలో ఉన్న అవతారమ్మగారు చంకన సంచీ తగుల్చుకుని మెల్లిగా బైటికి జారుకుంది.

తల్లీ, భార్యకి దగ్గర బంధువయిన అవతారమ్మ ఆప్తబంధువులా వచ్చి కూర్చుని మెల్లిగా ఇద్దరి దగ్గర కూపీలెక్కలాగి, అత్తాకోడళ్ళ మధ్య మరింత నిప్పు రాజుకునేలా చేసి ఆ నిప్పులో తన్ని దహనం చేసి వెళ్ళిపోయింది. ఒక్క ఉదుటున వెళ్ళి ఆమె పీకపట్టుకుని నలిపెయ్యాలన్నంత కోపం వచ్చినా చెయ్యలేని నిస్సహాయతతో నీరుగారిపోయి కూలబడ్డాడు భానుమూర్తి.

బ్యాంకులో సొమ్ము, నగలు జప్తుచేసుకుని వూరుకొని టేక్సులవాళ్ళు మరో గంటకి ఇంటిమీదకి దాడిచేసి, తల్లీ భార్యల దగ్గరున్న నగలు, డబ్బూ కూడా పట్టుకెళ్ళిపోతుంటే అత్తా, కోడళ్ళు ఏడుపులూ, అల్లర్లూ బ్రేకేసినట్లు ఆపేసి భానుమూర్తికేసి వెర్రివాళ్ళల్లా చూడసాగారు – సంగతేమిటో అర్థంకాక.

"మేనేజర్ మీద కసిని బదిలీతోటే తీర్చుకున్నావురా దేముడా! నన్ను ఇంట్లోనూ, ఆఫీసులోనూ బతకనివ్వకుండా, చావనివ్వకుండా సర్వనాశనం చేసి కసి తీర్చుకున్నావు కదా బాబూ! అయినా నా అతి తెలివితేటలే నా కొంప ముంచాయిరోయ్ నాయనా!" అని ఏడుస్తున్న మహాతెలివైన భానుమూర్తికేసి భార్య, తల్లి అవాక్కయి చూడసాగారు. అసలు కథేమిటో వాళ్ళకి తెలియదు.

స్వాతి వారపత్రిక

**14 ఆగష్టు 1992**